# మానవ వికాస వేదిక

## తెలంగాణా రాష్ట్ర 3 వ మహాసభలు

**వేదిక : శ్రీ సాయి రూప గార్డెన్ ఫంక్షన్ హాల్, జమ్మికుంట రోడ్, హుజురాబాద్, కరీంనగర్ జిల్లా**
**సమయం : 2019 ,డిసెంబర్ 14,15, తేదీలు**

## ఆహ్వానం

మిత్రులారా!

హ్యూమనిస్ట్ (మానవవాద) ఉద్యమసంస్థగా ఉన్న మానవ వికాస వేదిక (మా.వి.వే.), తెలంగాణా రాష్ట్ర 3వ మహాసభలకు మీకు ఆహ్వానం పలుకుతున్నాం. భావవిప్లవ చైతన్యానికి ప్రేరణనిచ్చే ఈ మహత్కార్యానికి హుజురాబాద్ పట్టణం వేదిక అవుతున్నందుకు మా.వి.వే. చాలా సంతోషిస్తున్నది.

మానవ వికాస వేదిక 15 సంవత్సరాల కిందట హైదరాబాద్ లో ఆవిర్భవించి పలు ప్రత్యక్ష కార్యక్రమాల ద్వారా తెలంగాణా ప్రజానీకానికి దగ్గరైంది. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జనంలో చైతన్యం పెంచింది. బాణామతి పేర అమాయికులను మంత్రగాళ్లుగా ముద్రవేసి వారిపై హింసాత్మక దౌర్జన్యాలు సాగిస్తుంటే అడ్డుకోవటమే కాక, మంత్రాలు, తంత్రాలు కేవలం మోసాలని చాటిచెప్పింది. రెండేళ్ళక్రితం కందుగులలో ఇదే అంశంపై ఒక కుటుంబం మొత్తం ఘోర అవమానంతో ఆత్మహత్యకు గురైనపుడు, ఆవూరి నుండి పెద్దపల్లి వరకు, ఆ తర్వాత, సిద్ధిపేట జిల్లా లోను, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యయాత్రను నిర్వహించింది. మూఢనమ్మకాలను నిరోధించే/ తొలగించే చట్టం రాష్ట్రంలో లేకపోవటం వల్ల అనేక దురాచారాలు కూడా అనేక అనర్థాలకు కారణమవుతున్నాయని, కనుక అలాంటి చట్టం చేయాలని ప్రభుత్వానికి లక్ష పోస్ట్ కార్డులను పంపి డిమాండ్ చేసింది. వాస్తు, జ్యోతిష్యం, రంగురాళ్ళు, తాయెత్తులు, శుభయంత్రాలు, పేరుబలం, గుప్తనిధులు పేరుతో జరుగుతున్న దోపిడీని, వంచనను నిలదీస్తూ పలు చైతన్య కార్యక్రమాలు చేపట్టింది. విద్యార్థుల్లో వైజ్ఞానిక దృక్పథాన్ని పెంచి, ఆలోచనాశీలురుగా మారటానికి, గణిత, భౌతికశాస్త్ర ప్రతిభాపరీక్షలను నిర్వహించి "బాలలు సమాజ మేధోసంపద" అని చాటి చెప్పింది. ఈ ఏడాది కూడా, బాలల్లో వుండే విమర్శనాత్మక ఆలోచనను (క్రిటికల్ థింకింగ్) వెలికితీసే పరీక్షతో బాల మేధావులను సత్కరించింది. మానవీయ విలువల ప్రచారంకోసం ప్రజలమధ్య సమావేశాలు ఏర్పరచి, ప్రజాస్వామిక కుటుంబ నిర్మాణాన్ని ప్రోత్సహించింది. కులనిర్మూలనా కృషిలో భాగంగా కులరహిత, ఆదర్శ వివాహాలను జరుపుతోంది. ఇంకా అనేక విధాలుగా మా.వి.వే. తన భావవిప్లవ దీపికతో సమాజంలోని అజ్ఞానపు చీకటిని తొలగించే కృషితో ముందుకు పోతున్నది.

మన ఆలోచనల్లో మన అభివృద్ధికి దోహదపడే మౌలిక మార్పు రావటమే భావ విప్లవం. వైజ్ఞానిక రంగంలో జరుగుతున్న అభివృద్ధి, సాంకేతికత(టెక్నాలజీ)ను పెంచుతూ మునుపటి కంటే మన జీవితాలను సుఖమయం చేస్తున్నప్పటికీ, మన ఆలోచనల్లో తగిన మార్పులు రావటంలేదు. ప్రపంచం సెల్‌ఫోన్ రూపంలో మనచేతిలో ఇమిడినప్పటికీ, తరాలనుంచి వస్తున్న మూఢత్వం తగ్గకపోవటమే అందుకు నిదర్శనం. మీడియా ప్రచారాలవల్ల ప్రజలు మళ్ళీ వ్రతాలు, నోములు, కొలుపులు, అర్చనలువంటి కాలంచెల్లిన ఆచారాల్లో మళ్ళీ కూరుకుపోతున్నారు.